సంక్రాంతి సరదా

ఆ జూదగాండ్ర జట్టును పట్టుకోవాలని ప్రయత్నించిన సబ్ యినస్పెక్టరు మూర్తి ఆచూకీ తెలిసి వాళ్లు ముందుగా పారిపోవడంతో చీకాకుగా స్టేషనుకు తిరిగివచ్చి, చేతిలోని టార్చిలైటు టేబులుమీద పడవేసి కుర్చీలో చతికిలబడ్డాడు.

"మనం వస్తామని వాళ్లకు ముందుగానె తెలిసివుంటుంది సార్! అందుకే ఒక్కడైనా కనుపించకుండా పోయేరుసార్" అన్నాడు కూడావచ్చిన కానిస్టేబుల్.

"వాళ్లకు తెలియడంకాదుగాని మనం యింకా కొంచెంముందుగా పోయివుండవలసింది"

"మరి యెందుకు పోలేదు సార్"

కాపూరి నరసింహశెట్టి

"నాకెందుకో అలసటగావుంటోందిమధ్య. అనుకున్న పని వెంటనే చేయలేకపోతున్నాను"

"హార్లిక్సు పుచ్చుకోండి సార్! మీకు ప్రమోషనుకూడ వస్తుంది. నేను పేపరులో చదివేను. హార్లిక్సు పుచ్చుకుని హుషారుగా పనిచేసినందుకు రాజు అనేవాడికి ప్రమోషను వచ్చింది.

ఆ చీకాకులోకూడ మూర్తికి నవ్వు వచ్చింది. సరే! నీవుపోయి డ్యూటీ చూచుకోమని కానిస్టేబిలును పంపించివేసేడు.

మూర్తి బి. యే. పాసైనవెంటనే సబ్ యినస్పెక్టరుగా సెలెక్టు అయి ట్రైనింగు పూర్తిచేసుకుని ఆస్టేషనుకు వచ్చేడు. వచ్చిన మొదటిరోజుల్లో యీ కుర్ర సబ్ యినస్పెక్టరునుచూచి మీసాలు మెలివేసే హేమాహేమీలు జులుంబలసిన రౌడీలు వెకిలిగా నవ్వేరు. కాని త్వరలోనే మూర్తి తనసత్తా వారికి చూపించేడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పట్టభద్రుడైన యువకుడు. పనియందు ఆసక్తి, న్యాయదీక్ష, దేశభక్తి వున్నవాడు. కాలేజీలో చదివే రోజుల్లోనే న్యాయాన్ని న్యాయంగాను, అన్యాయాన్ని అన్యాయంగాను తెలుసుకోగలిగిన వివేకి. అందువల్ల వచ్చిన మొదటిరోజుల్లోనే ముందు తనస్టేషను సిబ్బందిని మరామత్తు చేసుకున్నాడు. తరువాత రౌడీ అనేవాడిని దయాదాక్షిణ్యాలులేకుండా యెముకలు విరుగదన్నివేసేడు. తరువాత పెద్దమనుషుల తప్పులుపెద్దమనిషిగానే సరిదిద్ద ప్రారంభించేడు. అయినా ఆపెద్దమనుషులు అతన్ని కుర్రకుంకగా చూడసాగేరు. దానితో ఒకరిద్దరిని నిర్మొగమాటంగా కటకటాల మధ్యకు నెడపట్టిగెంటి మత్తువదిలించి కండ్లు తెరిపించేడు. దానితో అతను తామనుకున్నంత కుర్రవాడు కాదనిపించేడు. దానితో "ధన మూలమిదం జగత్" అన్న అస్త్రాన్ని ప్రయోగించేరు. అయినా యీ విశాలభావాలుగల మూర్తి లొంగలేదు. దానితో చాలామంది "సెహబాస్" అన్నారు. మూర్తి యెంతో గర్వపడ్డాడు.

మూర్తి అంతవరకూ బ్రహ్మచారిగానే వుండడంవల్ల మంచికట్నాలతో సంబం

ముంగిట ముగ్గు

చిత్రకారుడు: వి. యస్. ఆర్. శర్మ — శ్రీకాకుళం.

★ సంక్రాంతి సరదా ★

ధాలు రావడం ప్రారంభించేయి. అందులో కంటికి నిండైన యువతినీ, చేతులునిండిన కట్నంతో వివాహం చేసుకున్నాడు. నిజంగా అప్పటినుంచీ మూర్తికి యీ వుద్యోగమంటేనే చీకాకు కలిగిస్తోంది.

"వనితా విత్తాలు చాలా ప్రమాదకరమైన వనీ వాటికి దూరంగా వుండమనీ" తన తండ్రి గారు చెప్పిన సలహాను తన వుద్యోగ ధర్మంలో అక్షరాల పాటించేడు. కాని ప్రమాదకారణమనుకునే వనిత తన భార్య రూపంలోను, విత్తం కట్నం రూపంలోనూ రావడంవల్ల కాదనలేకపోయేడు. అయితే ఆ వనితా విత్తాలే తన ఈ నిరుత్సాహానికి కారణమూ.

యెన్నిసార్లు అర్ధరాత్రి సమయంలో అనుమానమైన చోటికల్లా వెళ్ళి ఎన్ని కేసులు పట్టలేదు.? కాని యిప్పుడు అవసరమైన చోటికి కూడా వెళ్ళడానికి బద్ధకిస్తున్నాడు. దగ్గరలేని అతని భార్య వైపు అతని ఆలోచనలు పోసాగేయి.

క్రొత్తగా వచ్చిన ఈమెయందు తనకెందు కింత మమకారం! చిన్నతనాన్నుంచీ తనతో పెరిగి తనను విడచిపెట్టని తన "టైగర్" కంటె, యేకగర్భజనితులైన సోదర సోదరీలకంటె, తన వృద్ధికి కారకుడైన పూజ్య పితకంటే, ఆఖరికి తన గర్భకోశంలో పెంచి తన రక్తాన్ని పంచి యిచ్చిన మాతృదేవత కంటే క్రొత్తగా వచ్చిన తనభార్య ఎంతో సన్నిహితం కావడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. తన టైగర్ మీదవుండే ముద్దువేరు, తోబుట్టువులపై వుండే వాత్సల్యం వేరు, తండ్రియందుండే పూజ్యభావం వేరు, కన్నతల్లిపై వుండే ప్రేమవేరు, తన భార్యపై వుండే మమకారం, ఏదో చెప్పలేని సన్నిహితత్వం, వాత్సల్యం వేరు అనుకున్నాడు.

వివాహమైన కొన్ని మాసాలకే, ఒకరి నొకరు పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే క్రొత్తలోనే దీపావళి పేరుతో సీతను తీసుకు వెళ్ళడం తటస్థించింది. దీపావళికి వచ్చిన ఆడపడుచును సంక్రాంతి వెళ్లే వరకూపంపించే ఆచారంలేదన్నారు. దానితో మూర్తి చాలా నిరుత్సాహ పడిపోయేడు.

తక్కిన ఉద్యోగాలవలె కావలసినప్పుడల్లా అతనికి సెలవు దొరుకదు. అందువల్ల తనకు ఆరోగ్యం సరిగాలేదనీ, సీతను వెంటనే పంపించమనీ మామగారికి టెలిగ్రాం ఇచ్చేడు. ఆ టెలిగ్రాం చూచుకుని మామగారు గాభరా పడ్డారు. వెంటనే ఆయనే బయలుదేరి వచ్చేసేరు.

కుంటున్న మూర్తిని చూచి ఆయన ఆశ్చర్యపడ్డాడు. అనుకోని యీ సంఘటనకు మూర్తి కూడ విస్తుపోయేడు. మామగారు వెండీమీసాల్లోనుంచి ముసిముసి నవ్వులు నవ్వేడు సంగతి అర్థం అయ్యిందనే భావంతో! తరువాత జేబులోని పచ్చనోట్లు రెండు తీసి 'మూర్తి చేతిలో పెడుతూ సంక్రాంతి యెన్నాళ్ళో లేదు గనుక తప్పకుండా సెలవు తీసుకుని రమ్మని చెప్పి వెళ్లిపోయేడు. ఆయన వెళ్లిపోయిన తరువాత తన కుర్రతనపు చేష్టలకు మూర్తి నవ్వుకున్నాడు. తన బి.ఎ. విజ్ఞానం, మీసాలు నెరసిన తన మామగారి ముందు ఎందుకూ పనికిరాకుండా పోయిందని తెలుసుకుని సంక్రాంతికి సెలవు కావాలంటే న్యాయంగా తనకు దొరకదుగనుక ఏ డాక్టరునో పట్టుకుని కొన్నాళ్లు మెడికల్ లీవు తీసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అదే విధంగా అతడు ప్రయత్నించడం, సెలవు దొరకడం కూడ జరిగింది.

సెలవు దొరికినందుకు మూర్తి యెంతో మురిసిపోయేడు. అతను బి. ఎ. పాసైనప్పుడుగాని, సబ్ ఇన్‌స్పెక్టరుగా సెలెక్టు అయినప్పుడుగాని మూర్తికి యింత ఆనందం కలుగలేదు.

అత్తవారింటికి వెళ్ళడానికి మూర్తి వుత్సాహంతో పెట్టె సర్దుకుంటున్నాడు. గడగడలాడించే చలికాలం. వివాహమైన తరువాత మొదటి పండుగ. భార్యవెళ్ళి చాలా కాలమయింది. కోరికలు గుట్టలుపడివున్నాయి. మూర్తి యీలపాట పాడుకుంటూ, పగటి కలలుకంటూ కావలసిన బట్టలన్నీ పెట్టెలో పెట్టుకున్నాడు. తనకు యిష్టమైనగులాబీరంగు సిల్కుచీర ఒకటి కొనితెచ్చి జాగ్రత్తగా పెట్టెలో పెట్టేడు. తాను వివాహానికి కొనుక్కున్న సెంటులన్నిటిలోనూ మంచిదైన మొగలిపువ్వు వాసన సెంటుసీసాకూడా పెట్టెలో పెట్టుకొని, దానిని మరచిపోనందుకు తనకుతానే అభినందించుకున్నాడు. రైలు టైముకు ముందుగానే స్టేషనుకుచేరుకున్నాడు.

మూర్తి వెయిటింగు రూములో కూర్చున్నాడు. అతని ఆలోచనలన్నీ అత్తవారి వూరిమీదనే వున్నాయి. తాను అక్కడికి వెళ్ళేసరికి సాయంత్రం అయిదు గంటలు అవుతుంది. మామగారు షికారుకు వెళ్ళి యింకా వచ్చివుండరు. బావమరది రామక్రిష్ణ సెలవుమీద వచ్చి వుంటాడో లేదో. నౌఖరు లెవ్వరి కంటాబడకుండా తాను తిన్నగా యింటికి వెళ్ళాలి. తలుపులు తీసివుంటే తిన్నగా లోప

దుక్కలా క్షేమంగా తా ర్ముని పనివాచులికి వెళ్ళిపోవాలి. ఆడవాళ్లంతా దొడ్డివైపున

వుంటారు. తిన్నగా అక్కడకు వెళ్ళిపోతే ఛా! అది అసభ్యంగా వుంటుంది. అసలే క్రొత్త అల్లుడను! ఆడవాళ్ళుండే చోటికి యెలా వెళ్లను! ఒకవేళ వీధితలుపు గడియ వేసి వుంటేనో! తాను వెళ్ళి తలుపుతట్టాలి. సీత, తన సీత స్వయంగా వచ్చి తలుపుతీసి తన్ను చూచి ఆనందంతో తబ్బిబ్బయి, సిగ్గుతో లోపలికి పరుగెత్తాలి. ఆమె సిగ్గును అర్థంచేసుకోలేక అత్తగారుఅదేమిటే! అలా సిగ్గుపడతావు. యెవరు వచ్చేరు?" అంటే సీత యేమని జవాబు చెబుతుంది? మూర్తి తనలో తానే నవ్వుకున్నాడు ఆదృశ్యాన్ని సృష్టించుకుని. టైము అయిందేమోనని బైటికి వచ్చి చూచేడు. వెధవరైలు గంట లేటు. అదీ యీరోజునే లేటుకావాలా! అతనుచాలా బాధపడ్డాడు. రెస్టారెంటుకు వెళ్లి కాఫీ ఒకటి తీసుకుని సిగరెట్టు వెలిగించి మళ్లీ వెయిటింగు రూముకు తిరిగివచ్చి కుర్చీలోకూర్చున్నాడు.

ఒకవేళ తాననుకున్నట్లుగాక షికారు నుంచి తిరిగివస్తున్న తన మామగారే ముందుగా చూస్తేనో! యిక ఆయన కంగారుకు అంతంవుండదు. ఆ నౌఖరునీ యీ వంటవాడినీ పిలచి నానా హంగామా చేస్తాడు. అప్పుడు సీతను చూడడానికి ఆలస్యమే 'కావచ్చు. అలా యెవరైనా చూచినా ఆనవాలు పట్టకుండా వేషం మార్చివేస్తే! పెద్దమీసాలు, దొంగగడ్డం తగిలించుకుని వెళితే! రైలు గంటలేటు! చీకటిపడేసరికిగాని అత్తవారింటికి చేరలేడు. చీకటిలో సరిగా గుర్తించలేక ముందుగా వారినౌఖరు యెవడైనాచూచి "యెవరువారు" అంటే తానేమని చెప్పాలి! మాట్లాడకుండా వెళ్ళిపోతే వూరుకునేరకం కాదు. "నేను ఫలానా" అంటే నమ్మడు. వాడు యేమైనఅన్నా చేసినా నేను వూరుకోలేను. యిది అసలే పోలీసురక్తం! వుద్రేకం జాస్తి! అక్కడితో నానా గలాభా! నగుబాటు! యీప్లాను మూర్తికి నచ్చలేదు.

కిటికీవద్ద చప్పుడయితే అలాచూచేడు మూర్తి. ఒక చక్కని పల్లెటూరి అమ్మాయి. అమ్మాయి అనడంకంటే యువతిఅంటే బాగుంటుందేమో? కూడా ఒకవృద్ధుడు తండ్రి కాబోలు పండుగకు తీసుకు వెళుతున్నాడు అనుకున్నాడు మూర్తి! ఆ యువతి ముఖంలోకి నూతన వధువుకు వుండేకాంతి, ఆ చెక్కిళ్ళలో ప్రియునితో గడిపిన క్రొత్తరోజుల్లో వచ్చే చక్కదనం కనుపించేయి. కూతురును పెట్టెపై కూర్చోమని వృద్ధుడు చుట్ట వెలిగించి ప్రక్కన కూర్చున్నాడు. మూర్తికి వారి మాటలు వినిపిస్తున్నాయి.

సంక్రాంతి సరదా

"అల్లుడు పండుగకు వస్తాడంటావా ?" ప్రశ్నించేడు వృద్ధుడు యువతి ముఖంలో సిగ్గుతెరలు మందంగా కనుపించేయి. తల వంచుకుని వయ్యారంగా నవ్వుకుంది అల్లుడుపేరులోనే యేదో తీయదనం వుందేమో !

"వూఁ" అన్నాడు వృద్ధుడు కూతురు నుంచి సమాధానం రాకపోవడంలో తన ప్రశ్నను మళ్ళీ అడుగుతున్న ధోరణిలో !

"తప్పకుండా వస్తానన్నారు మరి" యువతి చెక్కిళ్ళు సిగ్గుతో యెరుపెక్కేయి. కళ్లల్లో వింతకాంతి. గతరాత్రి రైలులో గడపిన భర్త జ్ఞాపకం వచ్చినట్లున్నాడు పాపం ! అనుకున్నాడు మూర్తి !

"వస్తాడులే! యిదే తొలిపండుగకదా!" అన్నాడు వృద్ధుడు. యువతి కళ్లతోనే నవ్వుకుంది మనస్ఫూర్తిగా.

"మంచిబట్టలు యివ్వలేదని మళ్లీ యేం గొడవ జరుగుతుందో" భయంగా అన్నాడు వృద్ధుడు.

"యీసారి అలా అనడులే" ధైర్యం చెప్పింది యువతి.

"యేం! నీ పెళ్లిలో బట్టలు మంచివి కావని పేచీపెట్టేడుగా" అందరిలోనూ తలవంపు అయిపోయిందికాదమ్మా"

"అప్పుడు ఆయనకంత తెలియదు నాన్నా! అన్నగారు వచ్చి పేచీపెట్టమన్నారట"

"అయితేమాత్రం అతనికి తెలియవద్దూ!"

తెలిసినా-వూరుకుంటే అన్నగారు కోప పడతారని అలా చేసేనన్నారు."

"పండుగకు యేమిచ్చినా పుచ్చుకుంటానని నీతో చెప్పేడా?" అన్నాడు వృద్ధుడు.

"వూం!" సిగ్గుతో అంది యువతి.

"అయినా అల్లుడిని తృప్తిపరచాలని యెవరికి వుండదమ్మా! యేదో వారివారి తాహతును బట్టి అల్లుళ్లకు బహుమతులు యిస్తారు. అలాంటప్పుడు అది బాగుండలేదు యిది నచ్చలేదు అంటే యిచ్చినవారి హృదయం యెంత గాయపడుతుందో తెలుసుకోలేరమ్మా వీళ్లు"

"మా అల్లుడు అలాంటివారు కాదులే నాన్నా" సిగ్గుతో భర్తను అలాంటివారినుంచి విడదీసుకుంది యువతి.

మూర్తి నవ్వుకున్నాడు.

పోర్టరువచ్చి రైలు వస్తున్నదని చెప్పి బెడ్డింగు తీసుకుని వరుగెత్తేడు. సంభాషణ విన్న తరువాత పెద్ద బహుమతులు యివ్వలేని మామలగురించి మూర్తి జాలిపడ్డాడు. "అల్లుడిని తృప్తిపరచాలని యెవరికి వుండదమ్మా" అన్న ఆ వృద్ధునిమాటల్లో యెంత నిజం వుంది! అది గ్రహించుకోలేక వారిని బాధ పెట్టడం యెంత మూర్ఖత్వం! అనుకున్నాడు.

సెకండు క్లాసు కంపార్టుమెంటులో కూర్చున్న మూర్తికి పదే పదే సీత జ్ఞాపకం రాజొచ్చింది. మధ్య మధ్య ఆ పల్లెటూరి యువతి-భర్తమాట చెప్పినప్పుడు ఆమె కళ్ళల్లోని కాంతి జ్ఞాపకం వచ్చేది. చిన్నతనాన్నుంచీ పెంచి పెద్దను చేసిన తలిదండ్రులనూ, తోబుట్టువులనూ విడచి, వివాహమైన వెంటనే భర్తతో వెళ్ళిపోయేటప్పుడు యే యువతి హృదయం తరుక్కుపోదు! తన విషయం యేమయింది? వివాహానికి ముందు తానెవరో! సీత యెవరో! చూపులకు వెళ్ళడం, వివాహం నిశ్చయించుకోవడం, వివాహానంతరం తనతో తీసుకురావడం కూడ జరిగిపోయింది. పాపం! తన వారందరినీ అలా విడిచి రావడం కష్టంకాదూ. అయినా భర్తతో కొన్ని రోజుల బాంధవ్యంతోనే యెన్నో సంవత్సరాల బాంధవ్యం వున్నవారినికూడ యీ స్త్రీలు యెలా మరచిపోగలరో! నిజంగా మరచిపోతారా? యేమో స్త్రీల హృదయం అతి నిగూఢం కదా! తప్పనిసరిగా ఆ వ్యామోహాన్ని, ఆ వాత్సల్యాన్ని అలా హృదయంలో దాచి పెట్టుకుంటారేమో. ఆ శక్తి పురుషులకు వుందా? అని సందేహించేడు మూర్తి.

రైలు రాజమండ్రి స్టేషను చేరుకుంది. రామకృష్ణ, మూర్తి బావమరది అక్కడే కాలేజీలో చదువుకుంటున్నాడు. యింకొక 10 మైళ్ళు పోతే తాను దిగవలసిన స్టేషను రానేవస్తుంది. యింతలో యెవరో యిద్దరు స్టూడెంట్లు ఆ కంపార్టుమెంటులోనికి వచ్చేరు. అందులో రామకృష్ణ వుండడం చూచి మూర్తి తబ్బిబ్బు అయిపోయేడు. రామకృష్ణ కళ్ళు సంతోషంతో మిలమిలా మెరిసేయి.

"యిదేమిటి బావగారు! యింత ఆకస్మాత్తుగా మబ్బులేని పిడుగులా వచ్చేస్తున్నారు" అన్నాడు నవ్వుతూ.

"యీ పిడుగు అంతేలే! యెక్కడకు వెళ్ళినా మబ్బులేనిపిడుగే" అన్నాడు మూర్తి రామకృష్ణ కళ్ళల్లో గోచరించే సీత కళ్ళల్లోని చిలిపితనాన్ని వింతగా చూస్తూ! రామకృష్ణ కూడా యింటికి వస్తున్నాడని తెలుసుకోవడంతో మూర్తి వూహించుకున్న తీయటి కలలన్నీ తల్లక్రిందులైపోయేయి. రామకృష్ణకు సీతకు పోలికలు చాలా వున్నాయి. కృష్ణ సీత కంటె కొంచెం పెద్దవాడైనప్పటికీ కొంచెం పొట్టిగా వుండడం వల్ల యిద్దరూ యించుమించు ఒకటే యెత్తు ఒకటే రంగు! ముఖ్యంగా అదృష్టాన్ని సూచించే ఆ విశాలమైన కళ్ళల్లో కనుపించే [illegible] నవ్వేటప్పుడు చొట్టలుపడే ఆ బుగ్గలు వారికి ఆభరణం. రామకృష్ణతో మాట్లాడుతూనే సీతను వూహించుకుంటూ కాలక్షేపం చేసేడు మూర్తి సరదాగా.

దిగవలసిన స్టేషను రావడంతో సామాను కూలి నెత్తినపెట్టి స్టేషనులోని పూల దుకాణంలో మంచి చేమంతి పొట్లం కట్టించి, వారపత్రిక ఒకటి తీసుకుని బావమరదితో కలసి అత్తవారింటికి వెళ్ళేడు మూర్తి.

యింటికి వెళ్ళే సరికి సాయంత్రం ఆరు గంటలయింది. షికారునుంచి తిరిగివచ్చి పడకకుర్చీలో పండుకుని తీరికగా లంక పుగాకు చుట్ట కాల్చుకుంటున్న మామగారు ఆనందంతో వుక్కిరిబిక్కిరి అయిపోయాడు. క్షేమసమాచారము లన్నీ అయిన తర్వాత ఆయనే స్వయంగా నౌకరులకు ఆజ్ఞలిచ్చి స్నానానికి నీళ్ళు,సబ్బు, తువాలు వగైరాల గురించి నానాహంగామా చేస్తుంటే మూర్తి నవ్వుకున్నాడు.

సీతను చూడాలని అతను తహతహలాడిపోతున్నాడు. కాని మామగారు విడిచి పెట్టడం లేదు. తన డ్యూటీలతో ప్రారంభించిన సంభాషణ ఈజిప్టును దురాక్రమణ చేసిన బ్రిటన్, ఫ్రాన్సులవరకూ సాగించేసేడు. తన లోకజ్ఞానం మామగారు పరీక్షిస్తున్నారేమో అన్న అనుమానం కూడా మూర్తికి కలిగింది.

తనను చూడాలనే కోరిక సీతకుమాత్రం వుండదా? ఒకవేళ యీ ప్రక్కగది కిటికీలోనుంచైనా చూడకుండా వుంటుందా అనుకున్నాడు. వెంటనే అతనికళ్ళు ఆత్రంగా నాలుగు మూలలకు పోయేయి. మాటలు తడబడ జొచ్చేయి. అనుకున్నట్లుగానే కిటికీ పూసల మధ్యనుంచి భిడియంతో చూచే రెండుకళ్ళు మూర్తి కళ్ళల్లోపడి తీయని కమ్మని సందేశాన్ని యిచ్చి యెవరో వస్తున్న అలికిడి కావడంవల్ల మాయమయ్యేయి. మూర్తి దీర్ఘంగా నిట్టూర్చేడు. యింతలో చిట్టిమరదలు వచ్చి నెమ్మదిగా "అక్క తాళాలు యిమ్మంది" అని అడిగింది. మూర్తి తాళాలగుత్తి తీసి తీరిగా మరదలుచేతిలో పెట్టేడు. కొద్ది సేపటికి ప్రక్కగదిలో తన పెట్టె తీసిన చప్పుడు, ఆ వెంటనే మొగలి పువ్వుసెంటు వాసన గదిలోంచి కిటికీ వచ్చి నాసికాగ్రంలోనుంచి నపాళానికి పోయి మధురానుభూతుల్ని రెచ్చగొట్టేయి. మామగారి మాటలకు 'ఆ, 'వూఁ' సమాధానాలు మాత్రం చెబుతున్నాడు మూర్తి. మరో పావుగంటకు మూర్తికి భోజనానికి పిలుపు వచ్చింది.

"హమ్మయ్యా!" అనుకున్నాడు మూర్తి.

యీసారి తప్పక సీత కనుపిస్తుంది అనుకున్నాడు. అతని గుండెలు ఆనందంతో వేగంగా కొట్టుకుంటున్నాయి. మర్యాదకు మామగారివద్ద సెలవుతీసుకుని భోజనాల గదిలోనికి బయలుదేరేడు. కొంపతీసి మామగారు తనతో తయారవడంలేదుగదా అని వెనుదిరిగి చూచేడు. ఆయన కూర్చున్న చోటనే వుండడంతో తృప్తిపడ్డాడు. పానకంలో పుడకలా రామకృష్ణ తయారవుతాడేమో! కాని అతని జాడేలేదేమిటి అనుకున్నాడు. అతను రాకూడదని మనసులో కోరుకున్నాడు.

గదిలో రెండు విస్తర్లు వేసివున్నాయి. కావలసినవన్నీ ప్రక్కనే వెండి పాత్రలలో దగ్గరగా అమర్చబడి వున్నాయి. మూర్తి వెళ్ళి ఒక విస్తరివద్ద కూర్చున్నాడు. సందేహంలేదు రెండవది వాడికే! రామకృష్ణకు! అని మనసులోనే రామకృష్ణపై విసుక్కున్నాడు.

"సీతా! మీ ఆయనవచ్చి కూర్చున్నారు. నీవు కూడ వెళ్ళి కూర్చోవే" ఎవరిదో స్త్రీ కంఠం, బహుశః సీత స్నేహితురాలి కంఠం కాబోలు తియ్యగా అతని చెవుల్లో పడింది. కంటికి కనుపించని ఆ స్త్రీని దేవతగా వూహించుకుని మూర్తి ఆమెకు ధన్యవాదాలర్పించేడు. ఆ వెంటనే "రామకృష్ణా! నీవెందుకు ఇక్కడ? పోయి వీధిలో కూర్చో! వాళ్ళిద్దరినీ కులాసగా భోజనం చేయనియ్" అని శాసించింది. తరువాత కిలకిలమనే ఆడవాళ్ళ నవ్వులు సెలయేరు ధ్వనిలా గదిలోనికి వినిపించేయి. యెందుకో మూర్తికి కొంచెం సిగ్గువేసింది. కోర్కెలు అవధులు దాటుతున్నా, గుండెలు లోపల గంతులువేస్తున్నా, మునిముసి నవ్వులతో ముఖం క్రిందికి దించుకున్నాడు. ఆ వెంటనే కమ్మని, తియ్యని మొగలిపువ్వు సెంటు వాసనగుప్పున కొట్టింది. క్రొత్త చీర, తాను కొనుక్కువచ్చిన, తనకిష్టమైన గులాబిరంగు సిల్కుచీరతో సీతవచ్చి రెండవ విస్తరివద్ద నెమ్మదిగా కూర్చున్నట్లు క్రీంగంటితో, పెళ్ళిపీటలమీద పెండ్లికొడుకును చూడ ప్రయత్నించే పెండ్లికూతురులా చూచేడు. బైటకిలకిలా నవ్వినవారంతా తనను చూస్తారని అతనికి తెలుసు. కాని వెంటనే దభాలున తలుపు వేసిన చప్పుడు కావడంతో తల పైకెత్తేడు. ధైర్యంగా చిరునవ్వుతో సీతను చూచేడు. చూచిన వెంటనే తృళ్ళిపడ్డాడు. సీత చాలా మారిపోయింది. యిదేమిటి - యిలా నల్లబడిపోయింది? అసలు యీ వ్యక్తి తన సీత కానేకాదేమో అనిపించింది, దీర్ఘంగా ఆమె కళ్ళల్లోనికి చూచేడు. అవేకళ్ళు ఆ విశాలమైన అందమైన కళ్ళు! కాని యిదేమిటి? యీమె తన సీత అని తనకళ్ళు నమ్మలేకపోతున్నాయి. తనకళ్ళు తననే మోసం చేస్తున్నాయి. సీత నవ్వుతోంది నెమ్మదిగా. తలదించుకుంది సిగ్గుతో! పమిటె సర్దుకుంది వయ్యారంగా! మూర్తి తనమతిభ్రమించిందేమో ననుకున్నాడు. యీమె మరొక అమ్మాయి కాదుగదా? తన అత్తవారింటిలో తాను తెచ్చిన చీర కట్టుకుని తనకిష్టమైన సెంటు ప్రాసుకుని తనతో కలసి భోజనం చేయడానికి తన సీతగాక మరెవరు సాహసిస్తారు? అయినా యేమిటో యీమె తన సీతకాదు! తనకళ్ళు తన్ను మోసం చేస్తున్నాయి. మూర్తి మరోసారి విచిత్రంగా ఆమెకళ్ళల్లోనికి చూచేడు. విశాలమైన ఆకళ్ళు వింతగా తనవైపు చూచి యేమిటన్నట్లు ప్రశ్నిస్తున్నాయి. నవ్వుతున్నాయి. ఆనందాన్ని ఆత్రుతను ముందుకు తోస్తున్నాయి. క్రొత్తవలపుల్ని కురిపిస్తున్నాయి.

మూర్తిని అనుమానం వెనక్కు లాగుతోంది. వలపు ముందుకు తోస్తోంది. అంతా తికమకలుగా వుంది.

"ఇదేమిటి యిలా అయిపోయేవు?" అన్నాడు మూర్తి!

"యెలా అయిపోయేను?" సిగ్గుతో జవాబిచ్చింది సీత.

యీ సమాధానంతో మూర్తి తటీమని పైకి లేచి పోయేడు. చూపుల్లో కోపం స్పష్టంగా తెలిసిపోతోంది! "యెవరు నీవు?" అన్నాడు కొంచెం గట్టిగా పోలీసు యినస్పెక్టరు దర్పంతో!

పక పక నవ్వుతూ పైకి లేచిన సీత విగ్గు లాగివేసి రామకృష్ణగా మారిపోవడం, కిలకిల నవ్వుతూ సీత, ఆమె స్నేహితురాలు లోపలకు రావడం ఒక్కసారే జరిగేయి. అదే మూర్తికి మొదటి సంక్రాంతిసరదా! ★

'సంక్రాంతి'

ధనధాన్యములను
సమకూర్చే పండుగ

* * * *

'కోప్ - ఫాబ్రిక్సు'

అందము, ఆహ్లాదము
సమకూర్చే వస్త్రాలు

* *

'సంక్రాంతి' పండుగకు
కోప్ ఫాబ్రిక్సునే ధరించండి

* *

ఆంధ్ర ప్రదేశమంతటనూ, మరియు మద్రాసు బెంగుళూరు, కటక్ నగరములలో మా విక్రయశాలలు గలవు.

* *

ఆంధ్రదేశ చేనేత సహకారసంఘము,
లిమిటెడ్. విజయవాడ-2.